# పతిభక్తి రంజని

నాలుగడుగులేసి యింకెంత దూరమంటే — అన్నానుట ఏడుపు మొహం పెట్టి...యింటి కొచ్చాక గొప్పగా చెప్పుతూ నవ్వడం ఆరంభించారు. అప్పుడు "నోయ్మయ్ రాస్కెల్" అని మా మావయ్య గారు తిట్టాక నియుంగా నోర్మూసుకుని కుక్కిన పేనులా గదిలోకి పోయి దాక్కున్నారు నా స్టూడెంటు మొగుడుగారు. "ఓపలేని పిల్లను అలా రోడ్లంట తిప్పకూడదురా! వొద్దు వొద్దని మా అత్తయ్య వార్నింగు యిచ్చినా వినకుండా కుర్రతనపు సరదాకొద్దీ, మావారు నన్నోమారు వైజాగ్‌లో బీచొడ్డు, సిన్మాకు- జేబులో "టూ అండ్ ఫ్రో" సరిపడే డబ్బు లున్నాయో లేవో చూసుగోకుండా నడిపించుకు తీసుకెళ్ళారు. అవ్వీజ్ బ్రెంషకదా — అందుకని నేనుకూడా తోకలా పతిభక్తిరంజనిలా నడుచు కుంటూ వెళ్ళాను.

ఆ నైటుకే నా కాళ్ళు పొత్రాల్లావాచి పోట్లూ సలుపులూనూ. నేను ఏడుస్తూ కూర్చుంటే "బొండాం- బొండాం" అని వెక్కిరించడంమొదలె ట్టారు. యూకలిప్టసాయిల్ తెప్పించి కాళ్ళకు రాసుకుని కాపడంపెట్టుకు పడుకున్నాను. నీ పతిభక్తి ఏడిసినట్లే ఉందని వాడితో తిరగొద్దని చెప్పానా? అని మా అత్తయ్య కేకలేసింది. అఫ్‌కోర్సు తిరగనని మాటి చ్చాను. భక్తి- పతిభక్తి ప్రదర్శించడానికిగాని, నిజంగా తు చ తప్ప కుండా ఫాలోఅయితే పిట్‌ఫాల్స్‌తప్పవని నాకేనాడోతెలిసింది. మొగుడు వెనక్కాల అరణ్యాల్లోకి వెళ్ళడమంటే పిక్నిక్కు వెళ్ళడమనుకుంది రామాయణంలో సీత.

అరణ్యవాసానికి అయోధ్యనువదలి వెళ్తూ గబగబా మూడు నాలుగు అడుగులు వేసి "ఇంకా ఎంత దూరం నడవాలి"అని రాముణ్ణి పదేపదే అడగడం మొదలెట్టిందట శిరీషకుసుమకోమలి సీత. అలా అడగగానే శ్రీరాముడి కళ్ళంట నీళ్ళుతిరిగాయట- మావారు శ్రీరాముడంత హైక్లాసు ఆద్మీ కాకపోవడంవలన, స్టూడెంటు గుణంకొద్దీ "ఇహ్హిహీ" అని వెక్కి-రించారుకాని నన్నలా అవస్థపెట్టి తిప్పడం అమానుషమని వారికి తెలీదు. వాళ్ల సరదాయే వాళ్ళకుగాని, ఆడదాన్ని సరదాకోసమైనా కష్టపెట్టకూడదని మగాళ్ళకి, అందులో కుర్రాళ్ళకి అసల్తెలీదు. మిఠాయుండ చేత్తో పట్టుకు కొరుక్కుతింటూ తిరిగే స్కూలు పిల్లాడి మనస్తత్వమే పెళ్ళయిన కుర్రాళ్ళది. అందుకే కాస్త పెద్దాళ్ళు అడపాతడపా చిన్న చిన్న చురకలు తగిలిస్తూంటేకాని దారిన పడరు. వయసూ సొగసూ వలపులూ తలపులూ అలా పరిగెట్టిస్తూంటే, ప్రేమకి కళ్ళెం తలుపుకి గొళ్ళెంలా పడాలి. పడకపోతే...... బ్లండర్సు జరుగుతాయి. పెళ్ళయిన కొత్తకోడలికి మొగుడు చెప్పినట్టువినడవా, పెద్దవాళ్ళు చెప్పినట్టు వినడవా అనేడైలమా అడుగడుగునా వొస్తూవుంటుంది. డైలమాలో పడ్డప్పుడు సరిగా తప్పించుకోకపోతే దలైలామా పడ్డ అవస్థలో పడాలిసొస్తుంది.

"తనువామెది సుందరం, మనసామెది సున్నితం"అని పెళ్ళికొడుకులందరికీ తెలీదు. మగాడు సిగ్గుపడకుండా మొండిగా బండగా వ్యవహరించగలడు. వెంటాడి వేటాడే స్వభావంకదా వాడిది. ఆడది పంజరంలో చిలక....చిలక్కి పంజరం ఆట్టే బాగుండదేమో కాని, చాలామంది ఆడాళ్ళకు బంగారుపంజరాలే శరణ్యం, మంచిదీకూడాను. పంజరంలో వుండాలంటే పతిభక్తివుండాల్సిందే... ప్రాచీనకల్చరో డర్టీకల్చరో ఏదో ఒకటి.... మన ఆడాళ్ళ దగ్గరే యింకా కొంత కల్చర్ మిగిలివుంది. మగాళ్ళు నీతిబీరకాయలే...

"అవసరార్థం అక్షతాం సమర్పయామి" అంటారు. కాని మనసు దాచుకోలేని కోర్కెల్ని చంపుకోలేని ఆడది "పతిభక్తిరంజని"గా తయా

రవుతుంది. కొంతమంది వెర్రిపెళ్ళాలుంటారు ( చాసోగారి 'ఏకరువు' కథలోలాగ )—అంటే వెర్రి-పెళ్లానికి కాదు— మొగుడంటే వెర్రివ్యామోహం వాళ్ళకు. మొగుడంటగాడైతేకాస్త, యిహ వాళ్ళ వాపిరిగొట్టుతనానికి హద్దూపద్దూ వుండదు. నిజమైన గొప్పపతివ్రతలు పతిభక్తి శ్రీరంజనీలు వీళ్ళే.... మొగుడికి మెళ్ళో నగలన్నీ బంగారుగాజుల్తోసహా తీసి యిచ్చేస్తారు ( పేకాటకి, తాగుడికి, ముండలికి )— కట్టుకున్న కోకనైనా అమ్మి మొగుడి సరదాలు తీరుస్తారు.

మొగుడు తంతూంటే కిక్కురుమనకుండాతిని- ఛోంచేసి వెళ్ళమని కాళ్ళమీదపడి బ్రతిమాలుకుంటారు. పసుపూ కుంకుమల సెంటిమెంట్ల ముద్దలులాగుంటారు. వారు చేసిపెట్టినది తినకపోతే వారి సేవల్ని అంగీకరించకపోతే తల పగలగొట్టుకు చస్తారు. కాని బయట అడ్డమైనతిరుగుళ్లు తిరిగే మగాళ్ళను వీళ్ళు లాలించి గారాలుమప్పి పాడుచేస్తారు. చెడ్డపెళ్ళానిలోపడే బాధకంటె మంచిపెళ్ళాంతో పడేబాధ (పోలీసువాడి దెబ్బలా) పైకి కనపడని గాయం- మంచిపెళ్లాలు కార్టూన్లకు కూడాదొరకరు. నీళ్ళలో నానడం, మడికట్టుకోడాలూ, పూజలూ, వుపవాసాలూ, భజనల్తో పతిభక్తిరంజనీలు లైఫ్‌ను లాగేస్తూంటారు.

కొందరాడవాళ్ళుంటారు. వాళ్ళు గోపికల్లాగ రాధల్లాగ ఊర్వశుల్లాగ వుండనేవుండరు. వాళ్ళు కథానాయికల్లా పైకి కనబడరు. చూస్తే ఏ మనోవికారం కలక్కపోగా "ఆడా—మగా" తేడా తెలుసుకోవడం కష్టం— చీర కట్టుకుంటే "అయ్యో చీర అందమంతా పాడుచేశారే" అనిపిస్తుంది. నగలు పెట్టుకుంటే 'అమ్మవార్ల'లాగుంటారు. కాని అలాంటి అమ్మలనే లక్ష్మిసరస్వతులు వెళ్ళివరించాయా అనిపిస్తుంది. మొగుళ్ళను సుఖపెట్టేది ఈ అమాయకపు స్త్రీలే. పిల్లల్ని మెడకు కట్టుకుని వీపులమీద మోసి పెంచి పెద్దచేసేది ఈ జనవే- వంటింటి మహాలక్ష్మల్లాటి ఈ అత్తయ్యలు పెద్దమ్మలు వదినెలు అక్కయ్యలే లేకపోతే, వాళ్ళకు తమ మొగుళ్ళమీద, పిల్లలూ, సంసారాలమీద యింతింతచెప్పడానికి వీలు

లేనంత వెర్రివ్యామోహాలు కలగ్గా—పోతే....మన సివిలిజేషన్లు డొల్ల.... ఇక భవిత్యముకల్ల.... అన్నమాట నిజమవుతుంది. అంచాత మిలట్రీ స్ట్రాటజీ ప్రకారం జీవితసమరంలో మగాళ్లు వీర విక్రమ రూపాల్ని ధరించి అరివీర భయంకరంగా పోరాడి విజయలక్ష్మిని సాధించాలంటే "యింట గెలచి రచ్చ గెలవాలికదా !" హోం ఫ్రంటుని తీర్చిదిద్దే ఈ ఆడాళ్లు — ఈ నిశ్శబ్దసంపుటాలు. ఈ సైలంట్ సోల్జర్లు మనకెక్కడికెళ్ళినా శ్రీరామరక్ష కలిగిస్తారు. పెళ్ళాంలో తల్లి దాక్కొనుంటుంది. అందుకే ఆ మహాతల్లి చెప్పినట్లు నడుచుకోవడం బెస్టు.... పెళ్ళాంలోని తల్లికీ తల్లిలోని తల్లికీ సరిపడదు లోకంలో.

పెళ్ళాం చెప్పినట్లు మొగుడు వినాలా, మొగుడు చెప్పినట్లు పెళ్ళాం వినాలా ? పెద్దవాళ్ళ చెప్పినట్లు కుర్రాళ్ళు నడుచుకోవాలా, కుర్రాళ్ళు వినాలా ? హోం ఫ్రంటుని బాధిస్తున్న ఈ క్రొశ్నలు ఎటర్నల్ క్వశ్చన్స్ "వినదగు నెవ్వరు చెప్పిన వినినంతనె వేగపడక వివరింపవలెన్" అన్నాడు సుమతీ శతకకారుడు. ఒరు లేయవి యొనరించిన నరవర అప్రియము తన మనంబున కగుదా నొరులకవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్" అన్నాడు విదురుడు. బైబిల్లోకూడా ఈ ముక్కలే తిరగేసి చెప్పారు. కనుక ఓ కోడలు పిల్లా "నీ కితరులు ఎలా చేయాలను కుంటావో నీవు ఇతరులకు అలా చెయ్యి." అలాగే ఓ అత్తగారూ "మీకు యితరులు ఎళాచేస్తే అయిష్టమో అటు వంటివి మీరు యితరులకి చెయ్యకుండా వుండండి." నట్సాల్ - దేర్ ఎండ్స్ ది మేటర్....ఓ మొగుడుగారూ.... మీరే ఓ పదహారు పదిహే డేళ్ళ వున్న అమ్మాయి ననుకుని. కడుపుతోవున్న పతిభక్తిరంజనినసుకొని మిమ్మల్ని పై పేరాలో నేనున్న స్థితిలో వూహించుకోమంటే "ఇహ్హిహీ-యిది నడవ లేక వెనుకబడ్తోంది" అని చెప్పడంకాదు. అప్పుడు మీకే తెలిసివస్తుంది. పెళ్ళాం "సైకో-అనాలిసిస్". ఇందు మూలముగా తెలియజెప్పే నీతి

ఏ మనగా "అనవసరంగా అమ్మాయిలను వెంటేసుకుని రోడ్లమీద త్రిప్పకూడదు."

ఇంటికి దీపం ఇల్లాలైతే, వీధిలోకి లాంతరు స్తంభం మగాడు.... అటువంటి లాంతరు స్తంభంగారూ, లేడీ డాక్టరు చేత తిట్లుతినకండి. బ్రేవో....బిహేవ్‌వెల్ మై గుడ్ బోయ్. పెళ్ళాం పతిభక్తి రంజనికదా అని, అడ్డమైనచోట్లకూ తిప్పకూడదు....రామాయణం జ్ఞాపకంచేసుకోండి. రావణాసురులు ఏకాలంలోనూ వుంటారు. మీరు రాముడిలా యుద్ధంచేయ లేరు కనుక, సీతల్ని కష్టపెట్టకండి.